పదవుల కేటాయింపులో 'పేట'కు పెద్దపీట

- నియోజకవర్గానికి మూడు జిల్లా పదవులు

నక్కపల్లి: పదవుల కేటాయింపులో పాయకరావుపేట నియోజకవర్గానికి వైఎస్సార్‌సీపీ అధినాయకత్వం పెద్దపీట వేసింది. జిల్లా అనుబంధ విభాగాల్లో ముగ్గురికి జిల్లా అధ్యక్ష పదవులు దక్కాయి. ముఖ్యమంత్రి, పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ అనుబంధ విభాగాల ఇన్‌చార్జి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి బుధవారం విడుదల చేసిన పదవుల జాబితాలో పాయకరావుపేటకు చెందిన పట్టణ అధ్యక్షుడు దగ్గుపల్లి సాయిబాబా పబ్లిక్ విభాగం జిల్లా అధ్యక్షుడిగా, నక్కపల్లి మండలం ఉపమాక మాజీ ఎంపీటీసీ సభ్యుడు కొప్పిశెట్టి అప్పారావు (హరిబాబు) స్టూడెంట్ విభాగం జిల్లా అధ్యక్షుడిగా, కోటవురట్ల మండలం వెంకటాపురం మాజీ సర్పంచ్ పైలా రమేష్‌ను పార్టీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడిగా నియమించారు. ఇప్పటికే ఈ నియోజకవర్గం నుంచి ఇద్దరు సీనియర్ నాయకులు విశాఖ సిటీలో రెండు నియోజకవర్గాలకు ఎన్నికల పరిశీలకులుగా వ్యవహరిస్తున్నారు. నక్కపల్లికి చెందిన రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ దక్షిణ నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులుగాను, పాయకరావుపేటకు చెందిన జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చిక్కాల రామారావు ఉత్తర నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులుగా వ్యవహరిస్తున్నారు. తాజాగా ముగ్గురిని పార్టీ అనుబంధ విభాగంలో జిల్లా అధ్యక్ష పదవులకు ఎంపిక చేయడం పట్ల సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. అనుబంధ విభాగాల జిల్లా అధ్యక్షులుగా ఎంపికైన దగ్గుపల్లి సాయిబాబా, కొప్పిశెట్టి హరిబాబు, పైలా ర మేష్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తమపై నమ్మకం ఉంచి అప్పగించిన పదవులకు పూర్తి న్యాయం చేస్తామన్నారు. పార్టీ ఉత్తరాంధ్ర ఇన్‌చార్జి వైవి సుబ్బారెడ్డి, మంత్రులు గుడివాడ్ అమర్‌నాథ్, బూడి ముత్యాలనాయుడు, పార్టీ జిల్లా అధ్యక్షుడు కరణం ధర్మశ్రీ, ఎంపీ భీశెట్టి సత్యవతి, పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చిక్కాల రామారావు, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణలకు కృతజ్ఞతలు చెబుతున్నామన్నారు.


కొప్పిశెట్టి హరిబాబు (స్టూడెంట్ విభాగం)


దగ్గుపల్లి సాయిబాబా (పబ్లిక్ విభాగం)


పైలా రమేష్ (బీసీ విభాగం)

క్లుప్తంగా

సాంస్కృతిక విభాగం అధ్యక్షునిగా సింగర్‌రాజు


జామి అప్పలరాజు

మునగపాక: వైఎస్సార్ సీపీ అనకాపల్లి జిల్లా సాంస్కృతిక విభాగం అధ్యక్షునిగా నాగులాపల్లికి చెందిన జామి అప్పలరాజు (సింగర్‌రాజు) నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు అందాయి. సీఎం జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు యలమంచిలి నియోజకవర్గం మునగపాక మండలం నాగులాపల్లికి చెందిన అప్పలరాజుకు ఈ అవకాశం దక్కింది. అప్పలరాజు ప్రస్తుతం నాగులాపల్లి వార్డు సభ్యునిగా సేవలందిస్తున్నారు. ఆయన తల్లి చినమ్మలు నాగులాపల్లి సర్పంచ్‌గా సేవలందిస్తున్నారు. కాగా తనకు అవకాశం కల్పించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి, ఎమ్మెల్యే యూవీ రమణమూర్తిరాజుకు, ఎంపీ డాక్టర్ సత్యవతికి, డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మకు కృతజ్ఞతలు తెలిపారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు


అరబుపాలెంలో పైప్‌లైన్ పనులు పరిశీలిస్తున్న సర్పంచ్ శ్రీనివాసరావు

మునగపాక: గ్రామంలో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని అరబుపాలెం సర్పంచ్ బొడ్డేడ శ్రీనివాసరావు తెలిపారు. మరమ్మతులకు గురైన పైప్‌లైన్ పనులను ఆయన గురువారం పరిశీలించారు. వేసవిలో తాగునీటి సమస్య రాకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. పంచాయతీ పరిధిలోని వార్డుల్లో ఎక్కడైనా తాగునీటి ఇబ్బందులు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

హైస్కూల్ రోడ్డులో పారిశుధ్య పనులు


పారిశుధ్య పనులు చేస్తున్న కార్మికులు

కోటవురట్ల: కె.వెంకటాపురంలో గురువారం పారిశుధ్య పనులు నిర్వహించారు. హైస్కూల్ రోడ్డులో చెత్త పేరుకుపోవడంతో పారిశుధ్య కార్మికులు చెత్త తొలగించి శుభ్రం చేశారు. సర్పంచ్ పైల శ్రీదేవి మంగా ఇందిర భవానీ మాట్లాడుతూ జగనన్న స్వచ్ఛ సంకల్పంలో భాగంగా ప్రతి రోజు పారిశుధ్య పనులు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. వీధుల్లో ఎక్కడపడితే అక్కడ చెత్త వేయకుండా నిర్దేశిత ప్రదేశంలో మాత్రమే వేయాలని సూచించారు.

రోడ్డు శిథిలమై రాకపోకలకు ఇక్కట్లు


శిథిలమైన బంగారమ్మపాలెం ఆర్ అండ్ బీ రోడ్డు

ఎస్.రాయవరం: చినఉప్పలం నుంచి బంగారమ్మపాలెం వెళ్లే రోడ్డుపై భారీ వాహనాలు తిరగడం వల్ల ఆర్ అండ్ బీ రోడ్డు శిథిలమైంది. ఇక్కడ కొందరు ప్రైవేట్ వ్యక్తులు కాంట్రాక్ట్ పనుల నిమిత్తం భారీ వాహనాలు నడుపుతున్నారు. భారీ లోడుతో లారీలు తిరగడం వల్ల ఈ సమస్య తలెత్తిందని స్థానికులు చెబుతున్నారు. ఈ ప్రాంతంలో సుమారు 4 కిలోమీటర్ల మేర సమస్య ఉన్నప్పటికీ ఆర్ అండ్ బీ అధికారులు ఎలాంటి చర్యలు తీసులేదని తెలిపారు. నెలల తరబడి ఇదే పరిస్థితి ఉండటంతో ఈ చుట్టుపక్కల ప్రాంతీయులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

ఘనంగా దుర్గాలమ్మ పండగ

రాంబిల్లి: గొరపూడిలో గురువారం దుర్గాలమ్మ తల్లి పండగను ఘనంగా నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. భజనలు, కోలాటాలు, తప్పెటగుళ్లు వంటి కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారి ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు.

ఘనంగా కాశీ విశాలాక్షి సమేత విశ్వేశ్వరుని కల్యాణం


కాశీ విశ్వేశ్వరస్వామి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం


అన్న సమారాధనలో పాల్గొన్న భక్తులు

మునగపాక: మెయిన్‌రోడ్డులోని లింగరాయిగుడిలో గురువారం కాశీ విశాలాక్షి సమేత కాశీ విశ్వేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం ఘనంగా జరిగింది. వేద పండితులు సోమశేఖర్ నేతృత్వంలో కల్యాణం నిర్వహించారు. ఈ సందర్భంగా కాశీ విశ్వేశ్వర స్వామిని దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చారు. ఉదయం నుంచి భక్తులతో ఆలయం కిటకిటలాడింది. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ చైర్మన్ సూరిశెట్టి రాము, కోశాధికారి వేగి సాయిబునాయుడు తగు చర్యలు తీసుకున్నారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన భారీ అన్న సమారాధనకు భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు పెంటకోట జగన్నాథం, పెంటకోట సూర్యనారాయణ, కిరణ్, భీశెట్టి వెంకట్, ఆడారి అచ్చియ్యనాయుడు, చిన్న తదితరులు పాల్గొన్నారు.

'రామోజీరావుపై క్రిమినల్ కేసు నమోదు చేయాలి'

నక్కపల్లి: పాత ఫొటోలతో తప్పుడు కథనాలు ప్రచురించి ప్రభుత్వంపైన.. పోలీసు యంత్రాంగంపైన దుష్ప్రచారం చేసిన ఈనాడు పత్రిక, దాని యజమాని రామోజీరావుపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ డిమాండ్ చేశారు. గురువారం ఆయన నక్కపల్లిలో విలేకరులతో మాట్లాడుతూ రామోజీరావుకు నైతికత ఉంటే తాను రాసిన తప్పుడు కథనంపై సవరణ ఇవ్వడం కాదని ఈనాడు పత్రికను మూసివేయాలని సూచించారు. టీడీపీ నేత పట్టాభిని పోలీసులు కొట్టారంటూ రెండేళ్ల క్రితం ఫొటోలతో ఈనాడు మెయిన్‌పేజీలో ప్రధాన శీర్షికన వార్త ప్రచురించి తన పాఠకులను, రాష్ట్ర ప్రజలను మోసం చేశారన్నారు. తాను రాసిన కథనం తప్పు అని అదే పత్రిక సవరించుకోవడం సిగ్గు చేటన్నారు. చంద్రబాబునాయుడు మెప్పు కోసం, టీడీపీని అధికారంలోకి తీసుకురావడం కోసం ఇటువంటి తప్పుడు కథనాలు రాస్తూ ఈనాడు తన పాఠకులను, రాష్ట్ర ప్రజలను మోసం చేస్తోందన్నారు.

విద్యా ఉపకరణాల పంపిణీ


విద్యా ఉపకరణాలు అందిస్తున్న సొసైటీ సభ్యులు

రావికమతం: ప్రామిస్డ్ ల్యాండ్ విమెన్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో గిరిజన పంచాయతీ చీమలపాడు శివారు గిరిజన గ్రామాల్లో 580 మంది పిల్లలకు రూ.20 వేల విలువ చేసే విద్యా ఉపకరణాలు గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ కార్యదర్శి అశోక్, సభ్యులు రమణ, కుమార్ మాట్లాడుతూ గిరిజన గ్రామాల్లో పిల్లలకు మెరుగైన విద్య అందించేందుకు తమ సంస్థ ఇప్పటికే పలు కార్యక్రమాలు చేపట్టిందన్నారు. అనంతరం వైద్యులు చిన్నారులను పరీక్షించారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తికి గాయాలు


బాధితుడిని ఆస్పత్రికి తరలిస్తున్న 108 సిబ్బంది

పాయకరావుపేట : మండలంలోని పాల్తేరు శివారు అంకంపేట గ్రామానికి చెందిన ఈ.సత్యనారాయణ విద్యుత్ షాక్‌కు గురైనట్లు పాయకరావుపేట పీహెచ్‌సీ 108 సిబ్బంది రాము తెలిపారు. సత్యనారాయణ తుని సమీపాన గల హంసవరానికి పొలం పనుల నిమిత్తం వెళ్లాడు. అక్కడ చెరువు గట్టుపై నడుస్తుండగా విద్యుత్ వైర్లు వేలాడటం గమనించకుండా తాకడం వలన షాక్‌కు గురయ్యాడు. దీంతో కింద పడిపోయిన సత్యనారాయణను స్థానికులు గుర్తించి 108కు ఫోన్ చేయగా సిబ్బంది తుని ఏరియా ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించినట్లు 108 పైలట్ రాము తెలిపారు.

కొనసాగుతున్న ధర్నా

రాంబిల్లి: నేవీ బాధితులు ధర్నా కొనసాగిస్తున్నారు. గురువారం నాటికి ధర్నా 116 రోజులకు చేరుకుంది. వాడనర్సాపురం, కొప్పుగొండుపాలెం, కొత్తపట్నం తదితర గ్రామాల ప్రజలు ధర్నా కొనసాగిస్తున్నారు. ప్రభుత్వం తమకు న్యాయం చేయాలని ఈ గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

నక్కపల్లి ఆర్‌ఐగా శివ


ఆర్‌ఐ శివ

నక్కపల్లి: మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా శివ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న ఆర్‌ఐలు నర్సింగరావు, శ్రీపాద సత్య భాస్కరప్రసాద్‌ను జాయింట్ కలెక్టర్ బదిలీ చేశారు. నర్సింగరావును రోలుగుంట సీనియర్ అసిస్టెంట్‌గాను, ప్రసాద్‌ను కలెక్టర్ కార్యాలయానికి బదిలీ చేయడంతో వారి స్థానంలో కోటవురట్ల ఆర్‌ఐగా పని చేస్తున్న శివను నియమించడంతో ఆయన బాధ్యతలు స్వీకరించారు.

భలే బాగు.. కూరగాయల సాగు

- తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభం
- దళారుల బెడద లేదు.. నేరుగా విక్రయం


కూరగాయల సాగు

కోటవురట్ల: కూరగాయల సాగు రైతుకు ఆర్థిక భరోసా ఇస్తుంది. ఒకే పంటపై ఆధారపడకుండా విభిన్న పద్ధతులను అవలంబిస్తూ వివిధ పంటలను సాగు చేస్తే చక్కటి ఫలితం పొందొచ్చు. కూరగాయలు ప్రతి కుటుంబానికి కావలసిన నిత్యావసరం. వీటిని తాజాగా అందిస్తే చెల్లుబాటుకు ఎలాంటి ఢోకా ఉండదు. కొందరు రైతులు అదే పని చేస్తున్నారు. కూరగాయల సాగు చేపట్టి మంచి ఫలితాలు రాబట్టి లాభాలు ఆర్జిస్తున్నారు. మండలంలోని జల్లూరు, యండపల్లి, లింగాపురం, బీకే పల్లి, అన్నవరం, చినబొడ్డేపల్లి, రామన్నపాలెం, పాములవాక, పీకే పల్లి, ఆక్సాహేబుపేట తదితర గ్రామాల్లో కూరగాయల సాగు ఎక్కువగా జరుగుతోంది. ప్రధానంగా జల్లూరు, లింగాపురం గ్రామాల్లో పలువురు రైతులు ఏడాది పొడవునా కూరగాయలే సాగు చేస్తున్నారు. తక్కువ పెట్టుబడితో తక్కువ కాలంలోనే అధిక ఆదాయాన్ని పొందుతున్నారు. మండలంలో సుమారు 80 ఎకరాల్లో కూరగాయల సాగు జరుగుతోంది. వంగ, బెండ, బీర, దొండ, చిక్కుడు, టమాటో, పచ్చిమిర్చి, ఆకుకూరలు ఎక్కువగా పండిస్తున్నారు.

సాగు ఇలా..

విత్తు నాటిన మూడు నెలల కాల పరిధిలోనే ఫలసాయం వస్తుంది. విత్తు నాటాక సకాలంలో నీటి తడులు పెట్టడం ద్వారా తొందరగా మొక్క ఎదుగుదల సాధ్యపడుతుంది. తెగుళ్లు సోకకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించాలి. పంటను పరిశీలిస్తూ ఎక్కడైనా తెగుళ్లు కనిపిస్తే వెంటనే నివారణ చర్యలు తీసుకోవాలి. ఎకరా పరిధిలో సాగుకు విత్తనాలు, ఎరువులు, కూలీల ఖర్చు కలిపి సుమారు రూ.10 వేల వరకు ఖర్చు కాగా ఫలసాయంతో సుమారు రూ.40 వేల వరకు ఆదాయం వస్తుంది.

దళారుల బెడద లేకుండా..

గతంలో రైతులు దళారుల కారణంగా ఎక్కువగా నష్టపోయేవారు. ఇపుడు రైతు బజార్లు రైతుల కష్టానికి తగిన ప్రతిఫలాన్ని ఇస్తుండగా ఎక్కువ ఆదాయాన్ని పొందుతున్నారు. కాలంతో పాటు పరుగెడుతున్న రైతులు ఇప్పుడు నేరుగా వారే విక్రయాలు నిర్వహిస్తున్నారు. ఇందుకు వారపు సంతలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. అంతే కాకుండా ప్రధాన రహదారుల వెంబడి తాజాగా కోసుకొచ్చిన కూరగాయలను వాటాలుగా పెట్టి విక్రయిస్తున్నారు. తాజా కూరగాయలు దొరుకుతుండడంతో ఎక్కువగా డిమాండ్ ఉంటుంది. దీని వల్ల రైతుకు సరకు విక్రయానికి ఎక్కువ దూరం ప్రయాణించాల్సిన అవసరం లేదు. ఆశీలు బెడద లేదు. దళారుల గొడవ అసలే లేదు. నేరుగా లాభాలన్నీ రైతుకే దక్కుతున్నాయి.

తక్కువ పెట్టుబడితో మంచి ఆదాయం

కూరగాయల సాగులో తక్కువ పెట్టుబడితో మంచి ఆదాయం వస్తోంది. నేను ఏడాదంతా కూరగాయలే పండిస్తాను. పండించిన కూరగాయలను రైతు బజార్లు, వారపు సంతల్లో విక్రయిస్తాను. దళారుల గొడవలేదు. నేను అమ్ముకుంటాను. తక్కువ ధరలో తాజా కూరగాయలు ఇవ్వడం వల్ల అమ్మకాలు బాగుంటున్నాయి. లాభాలు నేరుగా నాకే వస్తున్నాయి.

– పి.అప్పలనాయుడు, రైతు, జల్లూరు

ఎమ్మెల్సీ అభ్యర్థి సుధాకర్‌ను గెలిపించాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కన్నబాబురాజు

అచ్యుతాపురం (అనకాపల్లి): ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి సుధాకర్‌ను గెలిపించాలని ఎమ్మెల్యే కన్నబాబురాజు కోరారు. గురువారం అచ్యుత పబ్లిక్ స్కూల్లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పోలింగ్‌బూత్‌ల వారీగా సమీక్ష నిర్వహించారు. అధిష్ఠానం ఎంపిక చేసిన సుధాకర్‌ను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు రొంగలి జగన్నాథం, యలమంచిలి మున్సిపల్ చైర్మన్ పిళ్లా రమాకుమారి, డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ, మండల నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా షిర్డీ సాయి మందిర వార్షికోత్సవం

రావికమతం: తట్టబందలో షిర్డీసాయి మందిర వార్షికోత్సవం గురువారం ఘనంగా జరిగింది. గ్రామంతోపాటు పలు గ్రామాల రైతులు, వ్యాపారులు తరలివచ్చి పూజలు చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో భారీ విద్యుద్ అలంకరణతోపాటు భారీ సెట్టింగులు, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. సర్పంచ్ గోకివాడ రమణ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

అచ్యుతాపురం (అనకాపల్లి): అచ్యుతాపురం సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం మరమ్మతులు చేపడుతున్నట్టు విద్యుత్ శాఖ ఈఈ ఎస్.రమణమూర్తి గురువారం తెలిపారు. ఈ కారణంగా పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. తహసీల్దార్ కార్యాలయం, ఎంపీడీవో కార్యాలయం, వెదురువాడ, మాటూరు, దిబ్బపాలెం, చోడపల్లి, మోసయ్యపేట, రామన్నపాలెం, చీమలాపల్లి, భోగాపురం, కోనెంపాలెం, నారపాక, నునపర్తి, ఇరువాడ, పూడిమడక గ్రామాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 వరకు విద్యుత్ సరఫరా ఉండదని, అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

ఎ.భీమవరంలో 119 మందికి వైద్య సేవలు


ఎ.భీమవరంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి ధరణి

కె.కోటపాడు: ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంతో రోగుల ఇంటి వద్దకే వచ్చి వైద్య సేవలందిస్తున్నట్లు వైద్యాధికారి ధరణి తెలిపారు. గురువారం ఎ.భీమవరంలో 119 మందికి ఓ.పి ద్వారా వైద్యంతోపాటు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఆరోగ్య పరీక్షలు చేశారు. దీర్ఘకాలిక రోగుల ఇళ్లకు వెళ్లి 13 మందికి వైద్య సేవలందించారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ మూర్తి, హెల్త్ అసిస్టెంట్ డి.ఎస్.ఎన్.రాజు, ఏఎన్ఎం దేవి, ఆశా కార్యకర్త పాల్గొన్నారు.

సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం


ఎమ్మెల్సీ అభ్యర్థి కోలా గురువులను సత్కరిస్తున్న రేవుపోలవరం నాయకులు

ఎస్.రాయవరం: బీసీలను ఎంతగానో ప్రోత్సహిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటామని రేవుపోలవరం గ్రామ మత్స్యకార నాయకులు అన్నారు. విశాఖకు చెందిన కోలా గురువులను ఎమ్మెల్సీ అభ్యర్థిగా సీఎం ప్రకటించి మత్స్యకారులకు మరింత చేరువయ్యారన్నారు. గత ప్రభుత్వాలు మత్స్యకారులను వాడుకుని వదిలేశాయి తప్ప, తమ అభివృద్ధిని ఏనాడూ పట్టించుకోలేదన్నారు. ఈ సందర్భంగా రేవుపోలవరం మత్స్యకార నాయకులు, యువకులు ఎమ్మెల్సీ అభ్యర్థి కోలా గురువులను ఘనంగా సత్కరించి అభినందించారు. రేవుపోలవరం మత్స్యకార సంఘం, వైఎస్సార్‌సీపీ నాయకులు చోడిపల్లి మల్లికార్జునరావు, రాము, అప్పలరాజు, పాఠశాల కమిటీ చైర్మన్ చోడిపల్లి అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వక కలయిక



ఎమ్మెల్యే గొల్ల బాబూరావును పార్టీ పట్టణ అధ్యక్షుడు దగ్గుపల్లి సాయిబాబా గురువారం మర్యాదపూర్వకంగా కలిసారు. పార్టీ జిల్లా పబ్లిక్ వింగ్ అధ్యక్షుడిగా నియమితులైన సందర్భంగా కొరుప్రోలులో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో దగ్గుపల్లి సాయిబాబా ఎమ్మెల్యేను కలిశారు. పార్టీ అధిష్టానం తనను గుర్తించినందుకు సీఎం జగన్ మోహన్ రెడ్డికి, పార్టీ ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్, టీటీడీ చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డికి సాయిబాబా కృతజ్ఞతలు తెలిపారు.

– పాయకరావుపేట

జగనన్న గోరుముద్ద పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి


మునగపాక హైస్కూల్లో జగనన్న గోరుముద్ద పథకాన్ని పరిశీలిస్తున్న అప్పలనాయుడు

మునగపాక: జగనన్న గోరుముద్ద పథకాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని మునగపాక సచివాలయ కన్వీనర్ బొడ్డేడ అప్పలనాయుడు కోరారు. గురువారం ఆయన మునగపాక జిల్లా పరిషత్ హైస్కూల్లో అమలవుతున్న జగనన్న గోరుముద్ద పథకాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్ఠాత్మకంగా గోరుముద్ద పథకాన్ని అమలు చేస్తున్నారన్నారు. కొత్త మెనూ ద్వారా విద్యార్థులకు నాణ్యమైన పోషక విలువలతో కూడిన ఆహారం అందుతుందన్నారు. విద్యార్థులు కూడా కష్టపడి చదువుకుని పాఠశాలకు, తల్లితండ్రులకు పేరు తీసుకురావాలన్నారు. హైస్కూల్ హెచ్ఎం కాండ్రేగుల సూర్యనారాయణ కార్యక్రమంలో పాల్గొన్నారు.

చెరువుల సుందరీకరణ


సుందరీకరణ పనులు పూర్తి చేసుకున్న శ్రీరాంపురం చెరువు

పాయకరావుపేట : గ్రామాల్లో చెరువులను సుందరీకరించేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామాల్లోని చెరువులను గ్రామస్తుల భాగస్వామ్యంతో అందంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా మండలంలో గల శ్రీరాంపురం, సీతారాంపురం గ్రామాల్లో వున్న చెరువులను పరిశీలించి సుందరీకరణ పనులు చేపట్టారు. చెరువు చుట్టూ వున్న గట్టును బలపరిచి దానిని రహదారిలా తీర్చిదిద్దుతున్నారు. దీంతో ఇక్కడ వాకింగ్ చేసేందుకు వీలు కలుగుతుంది. అలాగే చెరువు చుట్టూ ఇనుప కంచె కూడా ఏర్పాటు చేయనున్నారు. చెట్ల పెంపకం కూడా చేపట్టనున్నారు. మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకానికి చెందిన (ఎన్ఆర్ఈజీఎస్) వేతనదారులతో పనులు చేయించటం ద్వారా వారికి ఉపాధి కల్పిస్తున్నారు.

కిరాణా షాపులో చోరీ

- రూ. 50 వేలు అపహరణ

నక్కపల్లి: జాతీయ రహదారిపై గల గణేష్ కిరాణా షాపులో బుధవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. రాత్రి 12 గంటల సమయంలో షాపు వెనుక డోర్ నుంచి దుండగుడు ప్రవేశించి క్యాష్ కౌంటర్‌లో ఉంచిన రూ. 50 వేలు అపహరించాడని యజమాని గణేష్ గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. రాత్రి పది గంటలకు షాపు మూసి ఇంటికి వెళ్లినట్లు తెలిపారు. ఉదయం ఏడు గంటలకు షాపు తెరవగా వెనుక డోర్ తెరచి ఉన్న సంగతి గుర్తించామన్నారు. వెంటనే క్యాష్ కౌంటర్ పరిశీలించగా అందులో ఉంచిన రూ. 50 వేలు కనిపించలేదన్నారు. సీసీ కెమెరాలో చూస్తే మాస్క్ ధరించిన యువకుడు ఈ చోరీకి పాల్పడినట్లుగా తెలుస్తోందన్నారు. కెమెరా వైపు చూసి కెమెరా జాక్‌లు తొలగించాడన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్ఐ శిరీష చోరీకి గురైన షాపును పరిశీలించారు. క్లూస్ టీమును రప్పించి విచారణ చేస్తున్నారు. 24 గంటల వ్యవధిలో మూడు చోరీలు జరిగాయి. మంగళవారం రాత్రి ఉపమాకలోని రెండు ఆలయాల్లో హుండీలు పగులగొట్టి దుండగులు రూ. 6 వేల నగదు అపహరించారు. ఇప్పుడు నక్కపల్లి మెయిన్‌రోడ్డుపై ఉన్న షాపులో చోరీ చేశారు.

మత్తు పదార్థాలతో భవిష్యత్తు నాశనం


అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న టౌన్ సీఐ గణేష్

నర్సీపట్నం: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని టౌన్ సీఐ ఎస్.గణేష్ పేర్కొన్నారు. డ్రగ్స్ వల్ల కలిగే దుష్ఫలితాలపై పెదబొడ్డేపల్లి డాన్ బాస్కో కళాశాల, పోలీసు శాఖ సౌజన్యంతో స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పలు శ్లోకాల ప్లకార్డులను విద్యార్థులు ప్రదర్శించారు. డ్రగ్స్‌కు బానిస అవటం వల్ల కలిగే అనర్థాలను చిన్న చిన్న స్కిట్లు, పాటల రూపంలో కళ్లకు కట్టినట్టు వివరించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రభుత్వం మత్తు పదార్థాల నివారణకు అనేక చర్యలు చేపడుతుందన్నారు. దీనికి ప్రజలు సహకారం అందించాల్సిన అవసరం ఉందన్నారు. తల్లిదండ్రులు ఎన్నో ఆశలతో చదువు కోసం కళాశాలలకు పంపిస్తే పలువురు విద్యార్థులు మాదక ద్రవ్యాలకు బానిసలై వారి ఆశయాలను అడియాశలు చేస్తున్నారని వాపోయారు. కళాశాల ప్రిన్సిపాల్ బెన్ని ఫాదర్, అధ్యాపకులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి శ్రీకారం

గొలుగొండ: పప్పుశెట్టిపాలెంలో తలుపులమ్మతల్లి ఆలయ నిర్మాణ పనులు గురువారం ప్రారంభమయ్యాయి. ఆలయ నిర్మాణానికి సంబంధించి ఇంజినీరింగ్ అధికారులు ప్లానింగ్ ఇచ్చారు. తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి మంజూరైన రూ.10 లక్షల నిధులతో ఆలయం నిర్మించనున్నారు. త్వరలో గుడి పూర్తి చేసి ప్రజలకు అందుబాటులో తీసుకువస్తామని సర్పంచ్ మాకిరెడ్డి విజయలక్ష్మి, పార్టీ యూత్ మండలాధ్యక్షుడు రామకృష్ణనాయుడు తెలియజేశారు. పాలకవర్గ సభ్యులు, గ్రామస్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.